విశాలాంధ్ర కృష్ణా జిల్లా

వంతెన మరమ్మతులకు నిధులు

మంత్రి జోగి రమేష్

విశాలాంధ్ర-గూడూరు: పెడన నియోజకవర్గం గూడూరు మండలం, కంకటావ-కత్తులువారిపాలెం గ్రామాల మధ్య ఉన్న వంతెన తక్షణ మరమ్మతులకు రూ.5 లక్షలు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్. 40 ఏళ్ల కింద నిర్మించిన కంకటావ - కత్తులు వారి పాలెం మధ్య ఉన్న వంతెన బలహీనంగా మారి భారీ వాహనాలు రాకపోకలకు ఇబ్బందికరంగా పరిణమించింది.భారీ వాహనాల రాకపోకలు ఈ వంతెన మీదగా నిషిద్ధం చేసినప్పటికీ, ఆదేశాలను భేఖాతారు చేస్తూ ఈ వంతెన మీద గత కొద్ది రోజులుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఆదివారం ఉదయం ఆ వంతెన స్వల్పంగా ధ్వంసం అయింది. వంతెన ధ్వంసం ఐన విషయం తెలుసుకున్న మంత్రి జోగి .రమేష్ హుటాహుటిన ఆ వంతెన ను సందర్శించి పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడి ఆ వంతెన తాత్కాలిక మరమ్మతలు నిమిత్తం రు.5లక్షలు మంజూరు చేయించడం జరిగింది.అంతేకాకుండా అతి త్వరలోనే నూతన వంతెన నిర్మాణం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయమని అధికారులను మంత్రి జోగి. రమేష్ ఆదేశించడం జరిగింది. వంతెన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినందుకు ఈ రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి పర్యటనలో వారితో పాటు గూడూరు మండల ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కంపుకొడుతున్న పార్కులు!

- అడవిని తలపిస్తున్న రామబ్రహ్మ పార్కు
- రాత్రుళ్లు విషకిటకాల సంచారం
- పార్కును దుర్వినియోగం చేసున్న స్వార్ధపరులు
- యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు
- పట్టించుకోని అధికారులు

మథర్‌థెరిస్సా విగ్రహం వద్ద చేత్తతో నిండిఉన్న దృశ్యం

విశాలాంధ్ర - గుడివాడ : స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా ఉన్న గుడివాడలో ప్రతీది ప్రత్యేకమే. ప్రధాన రాహదారి పకనే ఉన్న పార్కు అసాంఘీక కార్యకలాపాలు నిలయాంగా మారింది. పట్టించుకునే నాధుడే లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో చక్రం తిప్పే మాజీ మంత్రి ఉన్నప్పటికీ గుడివాడలో ప్రతి విషయం అడ్డుగోలనే ఉందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడవిని తలపిస్తున్న పార్కు

పట్టణంలో 5 పార్కులు ఉన్నాయి. వాటి అభివృద్ధికి గత ప్రభుత్వం కొన్ని కోట్లును విడుదల చేసినప్పటికి అవి నేడు ప్రజలకు ఉపయోగ పడకుండా ఉన్నాయి. ప్రధాన రాహదారి ప్రకనే ఉన్న పార్కులో ఒకటైన తుమ్మల రాంబ్రహ్మాం పార్కు అస్తవస్తంగా తయారైంది. కొంత మంది జూదరులకు, పేకాట రాయులకు, వ్యభిచారాలు నిర్వహించేకునే వారికి అడ్డాగా మారిందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్కు సమీపంలోనే పోలీసు స్టేషన్ ఉన్నప్పటికి కొంత మంది ఇక్కడ గంజాయిని సేవిస్తూ, అలరిచిల్లరగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే వారే లేరనేది విశ్వసనీయ సమాచారం. నేడు పార్కు మొత్తం పిచ్చి చెట్లు పెరిగి, అడవిని తలపిస్తోంది. ఇక్కడే ఉన్న సచివాలయం ముందుగా నిరోదులు, గుట్కా ప్యాకేట్లు గుట్టలుగా ఉన్న దర్శనమిస్తున్నట్లు, ఇక్కడి సిబ్బందే వాటిని వినియోగిస్తున్నరా లేక ఎవరైన వచ్చి ఇలా చేస్తున్నారో అర్థం కావడంలేదంటు పలువురు బాహటంగానే చర్చికుంటున్నారు. వీటిపై పూర్తి బాధ్యత మున్సిపాలిటికి ఉన్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థంకానీ ప్రశ్నగా మిగిలిపోయింది. కనీసం పార్కును కాపాలాగా ఉండే వాచ్‌మెన్ ఏమి పోయాడని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ పార్కు విషయంలో మాజీ మంత్రి పట్టించుకొని ఈ పార్కుకు రక్షణ కల్పించి, మళ్ళీ పట్టణ ప్రజలకు ఆహ్లాదం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విప్లవ గేయాల గాత్రం మూగబోయింది

ప్రజా కళాకారులు అడ్డాద నాగేశ్వరరావు కన్నుమూత

నాగేశ్వరరావు(ఫైల్)

విశాలాంధ్ర-చల్లపల్లి : విప్లవ గేయాలా గాత్రం మూగబోయింది. ప్రజా కళాకారులు, ప్రజా నాట్యమండలి నాయకులు, భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు(80) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురై వక్కలగడ్డలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన ఆయన రచయితగా, కళాకారునిగా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, ప్రజా నాట్యమండలి నాయకుడిగా విశేష గుర్తింపు పొందారు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలలో క్రియా శీలకంగా పనిచేసి తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసేవారు. కమ్యూనిస్టు పార్టీ తలపెట్టిన ప్రతి ఉద్యమంలోనూ ముందుండి నడిచేవారు. సాంఘిక నాటకాలకు దర్శకత్వం వహించి స్వయంగా నటించారు. పౌరాణిక నాటకాల ఆర్గనైజర్‌గా, మేకప్ మెన్‌గా ఎంతో ఖ్యాతిని ఆర్జించారు. ప్రజానాట్యమండలి ద్వారా ఎందరో శిష్యులను సమాజానికి అందించారు. వక్కలగడ్డ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు అడ్డాద నాగేశ్వరరావు తండ్రి అడ్డాద కోటేశ్వరరావు క్రియాశీలక భూమికను పోషించారు. తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న ఆయన అదే పందాను కొనసాగించారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, ప్రజానాట్యమండలి నాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘ నేతగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం, ప్రతిష్టా మహోత్సవాలు, ఆలయ అభివృద్ధిలో ముఖ్య భూమిక వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు అనేక ప్రాయోజిత నాటకాలను రూపొందించి గ్రామాల్లో ప్రదర్శించారు. ప్రజా కళాకారులు, అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గ ప్రజా నాట్యమండలి అధ్యక్షులు అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు మృతదేహాన్ని ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు పోతరాజు నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాద ప్రసాద్‌బాబు, సీపీఐ నేతలు రావి బాబూరావు, మల్లుపెద్ది బోసు, పాలడుగు రత్నబాబులు నాగేశ్వరరావు, ఆయన మృతదేహంపై ప్రజనాట్య మండలి, సీపీఐ జెండాలను కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. మల్లుపెద్ది లెనిన్, అల్లూరి బాబూరావు, పూసపాటి బ్రహ్మానందరావు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కేసనకుర్తి శరత్ బాబు, కాపూరి పరమేశ్వరరావు, విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, వీఆర్వో ఓగిరాల నాగమల్లేస్వరరావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

స్థలాల మంజూరులో సీఎం జగన్ చరిత్ర సృష్టించారు

విశాలాంధ్ర-అవనిగడ్డ : గతంలో ఏ సీఎం చేయని విధంగా సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 35.25 లక్షలు ఇళ్ళ స్థలాలు పంపిణీ ద్వారా చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇళ్ళస్థలాల మంజూరులో సీఎం జగన్మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని. గత ప్రభుత్వాలు వలె కాకుండా కేటాయించిన స్థలాల్లో రహదారులు, విద్యుత్. త్రాగునీటి, డ్రెయినేజీ సౌకర్యాలను కల్పించిన తరువాతనే ఇళ్ళ నిర్మాణం చేపట్టడం జరుతుందన్నారు. రెండేళ్ళు కరోనా వల్ల మెరక పనులు, ఇతర సౌకర్యాల కల్పనలో ఆలస్యం జరిగిందని 21.25 లక్షల ఇళ్ళు నిర్మాణం చేశారని చెప్పారు. మిగిలిన వాటిని దశల వారీగా ప్రారంభిస్తామని, ఇవన్నీ చేస్తుంటే చూసి ఓర్వలేక జనసేన, టీడీపీ రాజకీయం చేస్తున్నాయని అన్నారు. రూ.7.932 కోట్లు విలువైన నివేశన స్థలాలు ఇవ్వడం జరిగిందని. మెరక తోలడానికి రూ.1000 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. నియోజకవర్గంలో 8.796 మంది లబ్దిదారులకు నివేశన స్థలాలు ఇచ్చామని, వీటిలో ఎక్కడా పార్టీలు, కుల, మతాలు చూడలేదన్నారు. ఈ సమావేశంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు , లంకమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ చింతలపూడి బాలు, చిట్టూరి రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : బాలల దినోత్సవం సందర్భంగా గాంధీక్షేత్రం కమిటీ, దివిసీమ లలిత కళా సమితి, దివిసీమ బాల నందన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక గాంధీ క్షేత్రంలోని మండలి వెంకట కృష్ణారావు బి.ఈ.డి కళాశాలలో తొలి రోజు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వము, చిత్రలేఖన పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలల నుండి 82 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డా.గుడిసేవ విష్ణుప్రసాద్, దివిసీమ లలిత కళ సమితి కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, తుంగల పాండురంగారావు, పి.వెంకటేశ్వరమ్మలు కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామీణ వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ (రాజా)పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ రోజు సోమవారం ఉదయం అవనిగడ్డ గాంధిక్షేత్రం ఆవరణలో పాటల పోటీలు నిర్వహిస్తారన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ఐవీఎం సంస్థ ఆధ్వర్యంలో రూ. 27లక్షలు స్కాలర్షిప్‌లు

విశాలాంధ్ర-చల్లపల్లి : దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు లాప్టాప్ లు, స్కాలర్షిప్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఐవీఎం హెూమ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఐ వి ఎం స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఎందరో పేదలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ తన ఔదార్యాన్ని చాటుకుంటున్నారని ప్రశంసించారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సహకారంగా స్కాలర్షిప్లను, సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు లాప్టాప్ లను అందించి తోడ్పాటునివ్వడం అభినందనీయమన్నారు. సహాయాన్ని పొందిన విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తే ఐ వి ఎం సంస్థ అందించే సహకారానికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు. ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ నిర్వాహకులు డాక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఎల్కేజీ నుండి పీజీ వరకు చదువుతున్న పేద విద్యార్థులకు తమ సంస్థ ద్వారా రూ. 20 లక్షలు స్కాలర్‌షిప్‌ల రూపంలోనూ, రూ 3 లక్షల విలువ చేసే లాప్టాప్ లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆరుగురు ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు రూ.3 లక్షల విలువచేసే లాప్టాప్ లను, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు చదివే 15 మంది విద్యార్థులకు రూ. 4 లక్షలు స్కాలర్షిప్లను, ఎల్కేజీ నుంచి పదవ తరగతి వరకు వివిధ కార్పొరేట్ పాఠశాలల్లో చదివే 120 మంది విద్యార్థులకు గాను రూ. 13 లక్షలు ఫీజులుగా చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థులకు అండగా ఐవీఎం సంస్థ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందనితెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, సజ్జా బలరాం, పరుచూరి వెంకటేశ్వరరావు, ఐ వి ఎం డైరెక్టర్ వేములపల్లి రోజా తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రోగులను ఆదరించాలి : రత్నలక్ష్మి

విశాలాంధ్ర-గన్నవరం : కుష్టు రోగుల అభ్యున్నతి కోసం తమవంతు కృషి చేస్తున్నట్లు నిర్భయ క్రాంతి మహిళా మండలి విజయవాడ అధ్యక్షురాలు ఎ.రత్నలక్ష్మీ అన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు లెప్రసీ కాలనీలో కనతరపు సరస్వతికి రూ.16 వేలు విలువ చేసే ట్రై సైకిల్, 50 మంది రోగులకు దోమ తెరలను జి.ఆనంద లక్ష్మీ కుమారి జయంతి సందర్భంగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎ.రత్నలక్ష్మీ మాట్లాడుతూ నిర్భయ క్రాంతి మహిళా మండలి ఆధ్వర్యంలో కుష్టు రోగులకు నిత్యవసర సరుకులు అందజేసి, పలువురికి మరుగుదొడ్లు నిర్మించటం జరిగిందన్నారు. వీటితో పాటు అనేక సేవా కార్య క్రమాలు చేశామని వివరించారు. పేదలకు అండగా నిలవటమే నిర్భయ క్రాంతి లక్ష్యమన్నారు. లెప్రా సొసైటీ తెలుగు రాష్ట్రాల కో-ఆర్డినేటర్ మామిడి రాధిక మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రం లోని 48 లెప్రసీ కాలనీల్లో కుష్టు రోగులకు ప్రత్యేక పాద రక్షకాలు అందిస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక కిట్లు, ఇతర ఉపకరణాలు ఇస్తున్నామన్నారు. విజయవాడ పూర్ణ హార్ట్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ అనన్య, నిర్భయ క్రాంతి కార్యదర్శి పి.సత్యవతి, కౌన్సిలర్ నాగరాజు, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జి.వెంకటరాజు, కాలనీ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అవనిగడ్డ : గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాల్లో పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జుజ్జవరపు ప్రభుదాస్, ఎంపీపీ తుంగల సుమతీదేవి. జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో...

మండలంలోని గ్రంథాలయ శాఖలలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్‌నెహ్రూ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవంగా సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 20 వరకు పోటీలు నిర్వహిస్తామని బి.శ్రీనివాసరావు (పమిడిముక్కల) వి.ప్రతాప్ (కపిలేశ్వరపురం) బి.లావణ్య (అగినపర్రు) సిహెచ్. సుబ్బారావు (మేడూరు,పెనుమత్స) తెలిపారు.

పెదపారుపూడిలో...

నేటి నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమై, 20 వరకు జరుగుతాయని వెంట్రప్రగడ గ్రంథాలయ అధికారి కే. నాగరాజు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. హరి కిషోర్ చేతులమీదుగా ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు.

అయ్యప్పల అభిషేకాలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ గ్రామంలోని విఘ్నేశ్వరుని దేవాలయంలో ఆదివారం అయ్యప్ప దీక్షాదారులు, భక్తులు అభిషేకాలు నిర్వహించారు. మండలంలోనే కాకుండా వేరే ప్రాంతాలలోని పలు గ్రామాల నుంచి విచ్చేసిన అయ్యప్పలు వందమందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొని పూజాదకాలుని ర్వహించారు. అన్న సమారాధన నిర్వహించారు.

రెడ్డిపాలెంలో డ్రైనేజీ సమస్య తీర్చండి

విశాలాంధ్ర-పమిడిముక్కల: మంటాడ శివారు రెడ్డిపాలెంకాలనీ ఏర్పడి నప్పటి నుండి డ్రైనేజీ సమస్యతో సతమతమవుతున్నామని దీనిని మీరైనా తీర్చండని కాలనీ ప్రజలు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కి విన్నవించారు. రెడ్డిపాలెంలో ఆదివారం గడప గడపకు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కే ముఖ్యమంత్రి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని,తమ సమస్యని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందమూడి వీరమ్మ యంపిటిసి మేరుగ శ్రీ లక్ష్మి వైసిపి నాయకులు యేసుగ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

పశువుల పాకలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-పెడన : కమలాపురంలో సుమారు ఏడు పాడి గేదెలు ఉన్న ఒక పశువుల పాకా అగ్ని ప్రమాదానికి గురైంది. సమాచారం ప్రకారం కమలాపురం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న తోట రాంబాబు వెంకయ్య పశువుల పాక శనివారం రాత్రి సుమారు 7 గంటల 30 నిమిషాల సమయంలో ఆ పాకలో ఒక్కసారిగా మంటలు చెల్లరేగి పాక మొత్తం కాలిపోయిందని బాధితులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గేదెలు అగ్నిలో కాలిపోయి తీవ్రగాయాలు పాలయ్యాయి. సుమారు రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు గానీ స్పందించి కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

మెగా మెడికల్ క్యాంపునకు విశేష స్పందన

విశాలాంధ్ర పెడన : పెడన మండలం కట్లపల్లి గ్రామ సమీపానగల ది ఫంక్షన్ హాల్ నందు ఆదివారం సుఖీభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపుకు విశ్లేష స్పందన లభించింది అని ఆ ఫౌండేషన్ అధ్యక్షులు అద్దంకి నాగ శంకర్ తెలిపారు. ఈ శిబిరాన్ని అబ్దుల్ అజీమ్, అబ్దుల్ ఖారీ, అబ్బూరి పావని చౌదరి, ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ఎంతోమంది నిరుపేదలకు ఈ మెడికల్ క్యాంపు ఎంతో ఉపయోగపడిందని అన్నారు. వీరికి వైద్యం అందించిన వారిలో ప్రముఖ వైద్యులు డాక్టర్ బి వెంకటేష్, ఎంఎస్వి సత్యనారాయణ, బి నాగరాజు, వై దుశాంత్ కుమార్, ఉన్నారన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి అనేక సహాయ కార్యక్రమాలు ఉచితంగా చేస్తామని తమ సభ్యులు సహకారంతో మునుముందు అనేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ముక్కు పాండురంగారావు, సంద్రం జ్ఞానేందర్, పోర్ల విజయకృష్ణ, కోగంటి చిరంజీవి, ఉమ్మిశెట్టి స్వామి, ఎర్రం శెట్టి ఫణికుమార్, పోరంకి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నాయిబ్రహ్మణ శంఖారావంను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుడివాడ : ఈ నెల 15వ తేది విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ప్రతినిధుల సభ నాయీబ్రహ్మణ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీసాయి నాయీబ్రహ్మణ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వికుర్తి పోతురాజు పిలుపు నిచ్చారు. ఆదివారం సంక్షేమ సంఘం కార్యలయం వద్ద అయన విలేకర్లుతో మాట్లాడుతూ రాష్ట్రనాయిబ్రహ్మన సవిత సమాజం అధ్వర్యంలో జరిగే నాయీబ్రహ్మణ శంఖారంకు సంఘీలు పాల్గొనలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటుపల్లి నాగేశ్వరరావు పాల్గొటారన్నారు. అలయలలో పనిచేస్తున్న నాయీ బ్రహ్మణులకు పనిబద్రత కల్పించాలని, జీవో నెం 50ను అములు చేయాలని, రిలయన్స్ మాల్స్‌లో బారబార్ షాపులు పెట్టే అలోచనను విరమించుకోవలని తదితర సమస్యలపై ఈ శంఖారంలో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానిక ప్రతి నాయీ బ్రహ్మణులు పాల్గొలని కోరారు.

భట్లపెనుమర్రులో 'బాదుడే బాదుడు'

విశాలాంధ్ర-కూచిపూడి : ముమ్వ మండలం భట్ల పెనుమర్రు గ్రామంలో ఆదివారం సాయంత్రం కూడా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొమ్మరిది నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా ప్రభుత్వ అనుచిత వైఖరిపై తీవ్రంగా విమర్శించి తెలుగుదేశం పార్టీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మండల శ్రీకృష్ణ తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, మండలంలోని పలుగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గార్మి పండగ

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక 11వ వార్డులోని పఠాన్ మహల్ షాహే నూర్ జండా కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా గార్మి పండగ జరుపుకోవడం జరిగింది. ముస్లింలు గ్యార్మి షరీఫ్ గంధ మహెూత్సవ వేడుకలు సందర్భంగా పవిత్ర జెండాలతో ఊరేగింపును నిర్వహించారు. ప్రధానంగా నిప్పుల కర్రతో చేసిన కర్ర సాము అబ్బుర పరిచాయి. ఈ కార్యక్రమం మైనార్టీ నాయకులు యాసిన్, సయ్యద్ జబిన్, బాజి, అన్వర్, దాదా తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ పోయినవి

బొబ్బా శ్రీ లక్ష్మి కీర్తి తండ్రి సాంబశివరావు అను నేను కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం అగినపర్రు గ్రామంలో నివాసముంటున్నాను. ది.02/11/22న మా ఇంటి వద్ద నుండి పమిడి ముక్కల స్కూటర్‌పై జిరాక్స్ నిమిత్తం వెళ్ళు చుండగా మార్గమధ్యంలో నా సర్టిఫికెట్స్ సంచి ఎక్కడో జారి పడిపోయింది. ఆ సంచిలో నా పదవ తరగతి మార్కుల జాబితా, యితర కాగితాలు వున్నవి. జిరాక్స్ సెంటర్ నుండి మా గ్రామం వరకు వెతుకుతూ దారిలో కనిపించిన వారిని విచారిస్తూ వెళ్ళినా 09/11/22 వరకు దొరకలేదు. ఎవ్వరికైనా దొరికిన యెడల క్రింది అడ్రస్ కి తెలుపగలరు.

బొబ్బా శ్రీలక్ష్మి కీర్తి
తండ్రి: సాంబశివరావు
అగినపర్రు, పమిడిముక్కల మండలం
సెల్: 9505957731.

వన సమారాధనలతో సందడిగా గ్రామాలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో పలు గ్రామాలు ఆదివారం కార్తీక వన సమారాధనలతో సందడిగా మారాయి. ఒకవైపు పెద్దల పూజలు, మరొకవైపు పిల్లల ఆటపాటలతో ఆనంద వాతావరణం నెలకొంది. కూచిపూడిలో పెడసనగల్లు రోడ్డులోని భృగు మహర్షి వనంలో శ్రీ పద్మావతి సమేత భావన ఋషి పద్మశాలీయ బహుత్తమ సంఘం పర్యవేక్షణలో 27వ కార్తీక వన సమారాధనవేడుకలు అంబరాన్ని తాకాయి. ఈ సందర్భంగా కార్యవర్గ సంఘాన్ని కూడా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా వైఎస్‌ఆర్సిపి నేత కొండవీటి అమరబాలేశ్వరావు, సిపిఐ మండల కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావుల పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలలో కాటూరి శ్రీకాంత్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, కార్యదర్శిగా ఆకురాతి సాంబశివరావు, ఉపాధ్యక్షునిగాతుమ్మా శివ నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా తుమ్మలచెర్ల శేషు కుమార్, కోశాధికారిగా మునగాల వెంకట దుర్గారావు లో ఎన్నికయ్యారు, సభ్యులుగా చెరుకు రాజు, చెరుకు సుబ్బారావు, చెరుకు బాలసుబ్రహ్మణ్యంలు ఎన్నికయ్యారు.ఇదిలా ఉండగా మొవ్వ మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మొవ్వ రోడ్డులోని సీతామహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో కార్తీక వన సమారాధన నిర్వహించారు. మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కొమరవోలు రాము, మార్తి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గం లోని పలు గ్రామాల నుంచి ఆ సామాజిక వర్గీయులు హాజరైనారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆటలు, దంపతుల పూజలు తో ఆ ప్రాంతం ఉషారుగా మారింది. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీ కృషితో క్రీడా మైదానానికి నూతన హంగులు

విశాలాంధ్ర-గన్నవరం : ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషితో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి నూతన హంగులు సంతరించుకోనున్నాయని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య తెలిపారు. ఆదివారం విజయవాడలోని గృహంలో ఎంపీ బాల శౌరిని గన్నవరానికి చెందిన పలువురు ప్రముఖులు కలిసారు. తోట వెంకయ్య తో పాటు చిక్కవరం సర్పంచ్ అనే లక్ష్మణరావు, గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందర రావు, ఎమ్మెల్యే వంశీ ప్రతినిధి ఓలుపల్లి మోహనరంగా ఉన్నారు. తోట వెంకయ్య మాట్లాడుతూ.. గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లో జిమ్ ఏర్పాటుతోపాటు పిల్లల కోసం 10 లక్షలతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు ఎంపీ అంగీకారం తెలిపారని చెప్పారు. స్విమ్మింగ్ పూల్ వద్దా కోచ్ తో పాటు నిర్వహణకు సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. శాప్ ద్వారా వెంటనే అంచనాలు వేయించి పనులు ప్రారంభించాలని ఓలుపల్లి మోహనరంగా కు ఎంపీ సూచించారని చెప్పారు. జనవరి నాటికి పనులు పూర్తి చేయించి గన్నవరం ప్రజలకు అంకితం చేయాలని ఎంపీ ఆశించినట్లు తెలిపారు. అదేవిధంగా మన్నే సుందర్రావు గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్రే ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరగా ఆయన వెంటనే ఓకే చెప్పారన్నారు. 30 పడకల ఆసుపత్రిని మరో 10 పడకలు పెంచి 40 పడక ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారన్నారు. చిక్కవరం సర్పంచ్ అన్నే లక్ష్మణరావు బ్రహ్మయ్య లింగేశ్వర స్వామి కొండపైకి తారు రోడ్డు ఏర్పాటు చేసేందుకు 25 లక్షల రూపాయలు ఇవ్వాలని విన్నవించినట్లు తెలిపారు. తాను పరిశీలన చేసి అవసరమైన నిధులు సమకూరుస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వెంకయ్య తెలిపారు. ఇప్పటికే ఈ కొండపైకి రోడ్డు ఏర్పాటు చేసేందుకు అన్నే లక్ష్మణరావు విజ్ఞప్తి మేరకు ఎంపీ లావు కృష్ణదేవరాయలు 15 లక్షలు, ఏలూరు ఎంపీ పది లక్షలు, మరో ఎంపీ 15 లక్షలు ఇవ్వడానికి అంగీకారం తెలిపినట్లు లక్ష్మణరావు ఎంపీ దృష్టికి తెచ్చారన్నారు. గన్నవరం ప్రాంత అభివృద్ధి విషయంలో తాను పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ బాల శౌరి చెప్పారని అన్నారు. గన్నవరం నియోజకవర్గంలో జరుగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీ తో పాటు కొన్ని ముఖ్యమైన గ్రామాల్లో తాను పాల్గొంటారని ఎంపీ చెప్పారన్నారు. ప్రతినిధి బృందం ఎంపీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ టౌన్‌ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వరరావు, మోహన్‌బాబు
జూన్-2 ప్రెసిడెంట్‌గా వసీం బేగ్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఆంధ్ర రాష్ట్ర టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం విజయవాడ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ ఆదివారం విజయవాడలో నిర్వహించారు. ప్రతి రెండేళ్ళకు ఒకసారి ఎన్నిక జరగాల్సి ఉండగా రెండు సంవత్సరాల నుండి కరోనా కారణంగా ఎన్నిక జరగకపోవడంతో ఆదివారం సభ్యులందరి సమక్షంలో ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాంబాబు సమక్షంలో ఎన్నిక ప్రశాంతంగా, సజావుగా ఏకగ్రీవమైంది. ఎన్నికకు పర్యవేక్షకులుగా అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ నాయుడు, కిషోర్ పర్యవేక్షించారు. ఆంధ్ర రాష్ట్ర టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ పి.మోహన్ బాబు, వైస్ ప్రెసిడెంట్లు బి.మురళిగౌడ్, శ్రీనివాస్, అబ్దుల్ సత్తార్లు ఏకగ్రీవంగా ఎన్నిక ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా వి.వెంకట కృష్ణ, ఈసీ మెంబర్లుగా జి.వెంకటేశ్వరరావు, వి.శేషగిరి, ఎన్.గిరి, జీ.కృష్ణ, వి.జగదీష్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జోన్-1 ప్రెసిడెంట్ ఐవీ.రమణమూర్తి, జూన్-2 ప్రెసిడెంట్ వసీం బేగ్, జోన్-3 ప్రెసిడెంట్ బాబురావు, జోన్-4 ప్రెసిడెంట్ కృష్ణ సింగ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నిక అయిన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్ సభ్యులందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరిస్తామని తెలిపారు. పెండింగ్‌లో, ఉన్న ప్రభుత్వంతో ముడిపడి ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయటంతో పాటు తమ రావాల్సిన హక్కులను సాధించుకుంటామని చెప్పారు. కార్యవర్గం చేపట్టే అసోసియేషన్ సమస్యల్లో ప్రతి ఒక్కరూ సహకరించి భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గంధం ప్రసాద్, రఘునందరావు, రంగ ప్రసాద్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో నిలువుదోపిడీ!

తూకంలో పచ్చి మోసం
బోర్డుపై ఉన్న రేటుకంటే అధికంగా అమ్మకాలు

విశాలాంధ్ర- కంచికచర్ల : రైతు బజార్‌లో వినియోగదారులు దగా పడుతున్నారు. ప్రతిరోజు బోర్డుపై ఆరోజు కూరగాయల ధరలను మార్కెట్ రేటు ప్రకారం నిర్ణయించి రాస్తూ ఉంటారు. ఆరేటు ప్రకారం రైతు బజార్లో అమ్మకాలు కొనసాగించాలి. కానీ ఇక్కడ అమ్మకం దారులు అధిక రేట్లకు కూరగాయలను విక్రయిస్తుండడంతో ప్రతిరోజు వినియోగదారులు అధిక మొత్తంలో డబ్బును నష్టపోతున్నారు. అదేమని అడిగితే వినియోగదారులపై దుర్భాషలాడుతూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. అంతేకాకుండా తూకం విషయంలో కూడా పచ్చి మోసం జరుగుతుంది. ఇక్కడ ఉన్నవన్నీ ఎలక్ట్రానిక్ తూకాలు కావడంతో రెండు వైపులా తూకం డిస్ప్లేఅవ్వాల్సి ఉంది. కానీ ఇక్కడ వినియోగదారుడు వైపు కొన్నటువంటి కూరగాయలు ఎంత బరువు ఉన్నాయో డిస్ప్లేలో చూపించదు. ఒకవేళ చూపించినా సగం సగం అక్షరాలు మాత్రమే కనిపిస్తాయి.కానీ అమ్మకం దారుని వైపు మాత్రం పూర్తిగా చూపిస్తాయి. కారణం అవి పాత ఎలక్ట్రానిక్ తూకాలు కావడమే. ఇలాంటి తూకాలపై తూనికలు -కొలతలు డిపార్ట్మెంట్ చర్యలు లేకపోవడంతో వినియోగదారుడు అడిగినంత కాకుండా అంతకంటే తక్కువ తూకంతో అంటగడుతున్నారు. దీంతో డబ్బుకు డబ్బు,తూకానికి తూకం రెండు రకాలుగా వినియోగదారులు నష్టపోతున్నారు.అదేమని అడిగితే దుకాణదారులు బోర్డుపై ఉన్న రేట్లతో అమ్మితే మేము నష్టపోతున్నామని అంటున్నారు గతంలో ఎన్నోసార్లు పత్రికలలో వచ్చిన ఇలాంటి వార్తలను చూసి సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ మరల పాత విధానంతోనే అధిక ధరలు,తప్పుడు తూకాలతో అమ్మకాలు కొనసాగిస్తూ.. వినియోగదారుడుపై పెనుభారం మోపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని బోర్డుపై ఉన్న రేట్లనే అమ్మే విధంగాచేసి,తప్పుడు తూకాలతో నష్టపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధుల జాతీయ మహాసభలకు జిల్లా బృందం పయనం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ జాతీయ మహాసభలు ఈ నెల 16, 17 తేదీల్లో మైసూరులో జరుగనున్న వృద్ధుల జాతీయ మహాసభలకు జిల్లా నుంచి బృందం పయనమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రతినిధులుగా ఉమ్మడి కృష్ణా జిల్లా నుండి 19 మంది బృందం ఆదివారం పయనమయ్యారు. కృష్ణా జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూరు బాబురావు నేతృత్వం వహించారు. బ్యాంకుల్లో ఎవ్వరూ క్లైమ్ చేయకుండా అనామతుగా ఉన్న కోట్లాది రూపాయిల సొమ్మును వృద్ధుల సంక్షేమం కోసం కేటాయించాలని, రైళ్ల ప్రయాణంలో వృద్ధులకు ఇస్తున్న రాయితీని కోవిడ్ సమయంలో రద్దు చేశారని దానిని తిరిగి పునరుద్దరించాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశాల్లో వృద్ధుటల పలు సమస్యలపై చర్చించి వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల తీర్పుపై పునఃసమీక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు చెల్లుబాటు అవుతాయంటూ సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులు ఇచ్చిన తీర్పుపై 11 మందితో ఉన్న రాజ్యంగ ధర్మాసనం మాత్రమే విచారణ చేయవలసి ఉందని వెంటనే పునః సమీక్షించి తీర్పు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డిమాండు చేశారు.ఆదివారం నగరానికి విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్ స్వాగం పలికారు. నగరానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అగ్ర కులాల్లోని పేదలకు ఆర్థిక పరమైన స్కీములు పెట్టి అభివృద్ధి చేయాలి తప్ప విద్య,ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదని,ఆర్థిక అభివృద్ధి పథకం అంతకంటే కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి కులానికి తమతమ జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, అధికార పదవులలో వాటా ఇవ్వాలని కోరారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకే విరుద్ధమని ఇది రాజ్యాంగ పరంగా చెల్లుబాటు కాదని పేర్కొన్నారు.15% జనాభా ఉండి 80% పదవులు పొందుతున్న ఓ.సి.లకు రిజర్వేషన్లు అవసరమా అని ప్రశ్నించారు. దేశ సంపదలో 90% అగ్రకులాలదే. విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ విచారణ చేయాలన్నారు.దానికోసం తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-వత్సవాయి : మండలంలోని చిట్యాలలో శ్మారెళ్ళ అమ్మిరెడ్డి సత్యనారాయణరెడ్డి స్మారక ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పుల్లారెడ్డి సారధ్యంలో శంకర నేత్రాలయం గుంటూరు వారి సౌజన్యంతో ఉచిత నేత్ర పరీక్ష శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ సేవ చేయాలన్న మంచి ఆలోచనతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో 15 సంవత్సరాల నుండి ఈ మారేళ్ళ అమ్మిరెడ్డి సత్యనారాయణరెడ్డి గార్ల స్మారక ట్రస్టు ద్వారా పుల్లా రెడ్డి వారి కుటుంబ సభ్యులు చేస్తున్న సేవలు అమోఘమని కొనియాడారుకంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు సరైన చికిత్సలు చేయించుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన డాక్టర్ల అందుబాటులో ఉన్నారని,అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి గుంటూరు వెళ్లడానికి ఉచితంగా బస్సును ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా భోజన సౌకర్యాన్ని కూడా కల్పించి వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మారెళ్ళ పుల్లారెడ్డి బ్రదర్స్, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ రన్ హుస్సేన్, సర్పంచ్ ఎంపీడీవో, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగులో 'త్రినయని'

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : జీ తెలుగులో ప్రసారమయ్యే సీరియల్స్‌లో అందరికి ఇష్టమైనది, అత్యధిక రేటింగ్ వచ్చే సీరియల్ త్రినయని, అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో ప్రేక్ష కుల్ని కట్టిపడేసిన త్రినయని సీరియల్ రాబోయే ఎపిసోడ్స్‌లో మరింత యాక్షన్-ప్యాక్డ్ కంటెంట్‌తో ఆడియన్స్‌ని ఆకట్టుకోవడా నికి సిద్ధంగా ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. 14 నుంచి ప్రసారమయ్యే ఎపిసోడ్స్‌లో ట్విస్ట్‌లు, కథని మలుపు తిప్పే కీలక సన్నివేశాలు ఆడియన్స్‌ను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తాయని, రాబోయే ఎపిసోడ్స్‌ని ప్రేక్షకులందరూ తప్పక వీక్షించాలన్నారు.

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌కు
బెజవాడ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ క్రీడాకారులు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : డిసెంబర్ 11 నుంచి 22 వరకు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు బెజవాడ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ క్రీడాకారులు ఎంపికైనట్లు బెజవాడ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ క్రీడాకారులు ప్రధాన కార్యదర్శి బచ్చు మురళీకృష్ణ తెలిపారు. అక్టోబర్ 27 నుంచి 31 వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచడం ద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయారన్నారు. బచ్చు వరుణ్ కృష్ణ (డౌన్ హిల్ సీనియర్ విభాగం), జి.ప్రణవరెడ్డి (స్పీడ్ సబ్ జూనియర్స్ విభాగం), కె శాన్వి రఫియా (స్పీడ్ 9-11 విభాగం), ఎన్ .నిహారిక (స్పీడ్ ఇన్ లైన్ 9 -11 విభాగం, బి.జతిన్ (స్పీడ్ ఇన్ లైన్ 7-9 విభాగం), సిహెచ్.అభిరామ్ (రోలర్ ఫ్రీ స్టైల్ విభాగం) , డి.సమర్ కుమార్ (రోలర్ స్కూటర్ విభాగం), శివ సాయి (రోలర్ స్కూటర్ విభాగం) ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కోచ్‌లు ఎమ్.దిలీప్, బచ్చు వరున్‌కృష్ణలను జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ డి.దుర్గాప్రసాద్, అధ్యక్షులు జె.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి బచ్చు మురళీకృష్ణ క్రీడాకారులను అభినందించి జాతీయస్థాయిలో మంచి మెడల్స్ సాధించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.

కనుల పండుగగా శ్రీవారికి పుష్పయాగం

విశాలాంధ్ర-అవనిగడ్డ : కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని పులిగడ్డలో కొలువైయున్న పద్మావతి అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారికి లక్ష పుష్పాలతో యాగక్రతువును వైభవంగా చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆగమ పండితులు అగ్నిహోత్రం ధన్వంతరాచార్యులు, పార్థాచార్యుల బ్రహ్మత్వంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల పుష్పాలు స్వామివారికి అలంకరించి పూజలు నిర్వహించారు. రంగురంగుల పువ్వులతో శోభాయ మానంగా దర్శనమిచ్చిన వెంకటేశ్వర స్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ అనంతరం రాత్రి దీపోత్సవం జరిగింది. ఆలయ ప్రాంగణం దీపం కాంతులతో దేదీప్యమానంగా దర్శనమిస్తుంది.

పండ్ల అలంకరణలో తిరుపతమ్మ



విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : స్థానిక గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా మూడవ అలంకరణగా ఆదివారం పండ్లతో అలంకారం చేశారు. విజయవాడ వాస్తవ్యులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి కల్పనా దంపతులు పండ్లు మొత్తం విరాళంగా ఇచ్చారు. పండ్ల అలంకారంలో ఉన్న అమ్మవారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను ఆలయ వేద పండితులు, పూజారులు చేశారు. విజయవాడ లోని గుంటుపల్లికి చెందిన వారు అన్నదానంకు రూ.10,166 విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు జరిపి ఆశీర్వాదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

15 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల ఆట్యా పాట్యా చాంపియన్‌షిప్‌ను ఈ నెల 15, 16 తేదీలలో విజయవాడ రైల్వేస్టేడియం వేదికగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆట్యాపాట్యా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంభాదుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి 28 వరకు హర్యానాలో జరుగనున్న 28వ జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం అబ్జర్వర్ భూధోటి శివరామ్ (9393575526)ను సంప్రదించాలన్నారు.

15 నుంచి అండర్-19 జిల్లా జట్ల ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఈ నెల 15 నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాల అండర్-19 జిల్లా బాలిబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ కార్యనిర్వాముఖ కార్యదర్శి వి.రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. కెబిఎన్ కళాశాలలో బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, చెస్ క్రీడాంశాలలో బాలబాలికల జట్లను ఎంపికచేస్తామని తెలిపారు. ఫుట్‌బాల్ విభాగంలో బాలబాలికల జట్లను ఇంధిరాగాంధి మున్సిపల్ స్టేడియంలో, హాకీ బాలబాలికల జట్లను పిబి.సిద్దార్థా కాలేజ్‌లో ఎంపికచేస్తామని వివరించారు.

గుణదలలో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్: విజయవాడ గుణదలలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం ఈ ఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గుణదల సెంటర్ లోని ఓ బిల్డింగ్ పై అంతస్తులో అద్దెకు ఉంటూ కింద రోడ్డు పై పానీపూరీ. చాట్ బండి పెట్టుకొని వ్యాపారం చేస్తున్నాడు. ఈక్రమంలో ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. 6 ఫుల్ గ్యాస్ సిలిండర్లు, మరో 6 ఖాళీ గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి. కొన్ని గ్యాస్ సిలిండర్లు పేలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో మురళి, మణికంఠ కు స్వల్పంగా గాయపడ్డారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరాలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో ప్రపంచ డయాబెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత డయాబెటిక్ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక జీవీఆర్ హెల్త్‌కేర్ ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు. రోగులకు ఉదయం 6గంటల నుంచి ఉచిత పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలను అందించనున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పుట్రేల గ్రామంలో ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాసంస్థల నిర్వాహకుడు జె.రంగారెడ్డి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి రోగులకు నేత్రవైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించి, అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నామని ఆయన వివరించారు.

నేడు వీఎంసీలో స్పందన

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంతో పాటు మూడు సర్కిల్ కార్యాలయాల్లోని జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను ఆయా కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

యువ భారతాన్ని గుండె జబ్బుల నుంచి కాపాడుకుందాం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : 'యువ భారతానికి యువ గుండెలు చాలా అవస రం ఉందని, యువత తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటం అత్యంత ముఖ్యమైందని, తమపై ఒక కుటుంబం ఆధారపడి ఉందన్న విషయాన్ని నేటి యువత గుర్తు చేసుకోవాలని ముఖ్య అతిథిగా విచ్చేసిన సిద్దార్థ వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఈశ్వర్ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జే శాప్), రోటరీ క్లబ్ ఆఫ్ ఇండియా, యంగ్ హార్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు గుండె పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత ఎక్కువగా గుండె జబ్బుల బారిన పడుతున్నారంటూ వక్తలు అభిప్రాయపడ్డారు. 'యంగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ చదలవాడ కిరణ్ తేజ మెమోరియల్ ట్రస్ట్' (కేటీసీ) ఏర్పాటు చేసి యువతకు గుండె జబ్బులపై సిహెచ్.భానుప్రసాద్ అవగాహన కలిగిస్తున్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని తమ ఆరోగ్యం కోసం కేటాయించాలని డాక్టర్ జి.ఈశ్వర్ పేర్కొన్నారు. కిరణ్ తేజ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, పూర్వపు సబ్ కలెక్టర్ సిహెచ్.భానుప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో 11 ఏళ్లు ఉద్యోగం చేసి ఇండియా వచ్చిన నా కుమారుడు అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారని ఇది మా కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచివేసిందన్నారు. జే శాప్ అధ్యక్షుడు తాడేపల్లి రత్నాకర్ మాట్లాడుతూ పాత్రికేయులకు ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు ముందుకు వచ్చిన రమేష్ ఆసుపత్రి సిబ్బందికి, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ, యంగ్ హార్ట్స్ ఫౌండేషన్,కిరణ్ తేజ ఛారిటబుల్ ట్రస్ట్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంసి.దాస్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు కాజ, రమేష్ ఆసుపత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హెచ్.ఎస్.సోమనాథ్, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, టైమ్స్ ఆఫ్ ఇండియా న్యూ ఎడిటర్ ధారా గోపి, జే శాప్ ఉపాధ్యక్షుడు డి.రవికాంత్, ఏపీ హైకోర్టు బార్ కౌన్సెల్ కోశాధికారి డాక్ జంధ్యాల శాస్త్రి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలివే....

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విద్యుత్ మరమ్మ తులు, మెయింటినెన్స్‌కు నగరంలోని మొఘల్‌రాజపురం సెక్షన్, మహాత్మాగాంధీ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8:00 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ. సుధాకర్ ఆదివారం తెలిపారు. ఏఎస్ రామారావు రోడ్డు, రెవెన్యూ కాలనీ, కోనేరు లక్ష్మయ్య వీధి, ఖాంధారి రోడ్డు, పార్క్ రోడ్డు, పీడీకేటీ స్ట్రీట్, రఘురాం స్ట్రీట్, సిద్దార్థ పబ్లిక్ స్కూల్ రోడ్డు, కేఎస్ రావు స్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిలిచిన రోడ్డు మరమ్మతులు

ఆర్‌డబ్ల్యూఎస్ పైపులైన్స్ మంజూరు కాకుండానే నిలిపివేత

విశాలాంధ్ర-జి.కొండూరు : జి.కొండూరు నుంచి చెరువుమాధవరం వరుకు చేపడతున్న రహదారి విస్తరణతో ఆర్‌డబ్ల్యూఎస్ పైపు దెబ్బతినే అవకాశం ఉండటంతో ఆ శాఖ సిబ్బంది సంబందిత విస్తరణ పనులను ఆదివారం అడ్డుకున్నారు. ఆర్‌అండ్‌బి రహదారి పక్కనే జి.కొండూరు నుంచి గంగినేని గ్రామాల వైపు ప్రధాన కృష్ణా జలాల సరఫరా పైపులైన్‌ను గతంలోనే ఏర్పాటు చేసారు. అయితే రహదారి విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న పైపు లైన్‌ను పూర్తిగా తొలగించి కొత్త పైప్ లైన్‌ను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. అయితే కొత్త పైప్‌లైన్ అనుమతులు రాకుండానే అర్‌అండ్‌బీ అధికారులు పాత పైప్‌లైన్‌లను తొలగించే పనులను నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు సూచనలు మేరకు సిబ్బంది రాము అక్కడకు చేరుకుని విస్తరణ పనులను నిలిపి వేయించారు. పైప్‌లైన్ ఏమాత్రం దెబ్బతిన్న లేదా తొలగించిన దాదాపు ఆరు గ్రామాల ప్రజలకు మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్తున్నారు.

అన్నిదానాల్లోకి విద్యాదానం ఉత్తమమైనది

విశాలాంధ్ర- విజయవాడ (ఎడ్యుకేషన్) : కోనేరు చారిటబుల్ ట్రస్ట్ 22వ సర్వసభ్య సమావేశం గోసాలలోని సీనియర్ సిటీజన్స్ హోమ్‌లో కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, ప్రొఫెసర్ వీరమాచనేని పాండు రంగారావుని, వారి సతీమణి డాక్టర్ అరుణని ముఖ్య అతిథులుగా ఆహ్వానించి సత్కరించారు. అన్నిదానాలలోకి విద్యాదానం ఉత్తమమైందని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు నాలుగు సంవత్సరాలుగా పారితోషికాలు ఇస్తున్న కోనేరు చారిటబుల్ ట్రస్టును అభినందిస్తూ, తనవంతుగా అయిదు లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఇక్కడ ఒక ఆసక్తి రేకెత్తించే విషయం తమ ప్రొఫెసర్ని సత్కరిస్తున్నారని తెలిసి వారి శిష్యులు డీన్ ఐసిఎఫ్ఏఎల్ బిజినెస్ స్కూల్, రాయపూర్, ఛతీస్‌ఘడ్ నుంచి ప్రొఫెసర్ కె. కిషోర్, హైదరాబాద్ ఐసిఎఫ్ఏ క్యాంపస్ నుండి ప్రొఫెసర్ మొవ్వా పావని, రిటైర్డు సైల్ జనరల్ మేనేజర్ రాంబాబు రూర్కెలా నుండి హాజరయ్యారు. ఆచార్య దేవోభవ అన్న ఆర్యోక్తికి అర్థం పట్టేలా, ఈ సంవత్సరము 20 మంది విద్యార్థులకు రూ.2.11 లక్షల పారితోషికాన్ని ఇస్తున్నామని కార్యదర్శి కోనేరు భీమేశ్వరరావు చెప్పారు. ఇంటర్‌కు రూ.7,500, డిగ్రీ/డిప్లొమా విద్యార్థులకు రూ.9 వేలు, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.10 వేలు, మెడికల్ విద్యార్థులకు రూ.15 వేలు ఇచ్చామని, 14 మంది. విద్యార్థినులకు, 6గురు విద్యార్థులకు ఇచ్చామని చెప్పారు. దివంగత వ్యవస్థాపక ట్రస్టీ కోనేరు భాస్కరరావు కుమార్తెలు నార్ల మాలతి, డాక్టర్ యలవర్తి ఇందిర చెరో రూ.15 వేలు ప్రతిభావంతులైన ఇంజినీరింగ్ విద్యార్థినులకు పారితోషికాన్ని ఇచ్చారు. కార్యక్రమములో వ్యవస్థాపక ట్రస్టీలు నారాయణ రావు, వాసు దేవరావు, మాజీ మేయరు శ్రీధర్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ పద్మ అనిల్ కుమార్, కోశాధికారి శివాజీ ట్రస్టీలు, కోనేరు వెంకట రామారావు, నాగేశ్వరరావు, రాధాకృష్ణ (చంటి), వెంకట ప్రసాద్, కోటేశ్వరరావు, స్థల దాతలు నాగేశ్వరరావు, విజయకుమారిలు, కొండపల్లి మాధవరావు, సూర్యదేవర పాపారావు తదితరులు పాల్గొన్నారు.